


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకి కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *నిత్యజీవితంలో హాస్యం*

**నేను మొన్న మా తమ్ముడు డొక్కా ఫణితో** మాట్లాడుతూ "మొన్న ఓ అబ్బాయి కనిపించాడు, మృదంగం వాయిస్తాడు. అవునూ మృదంగం వాయించే వాళ్ళని ఏమంటాం?" అని అడిగాను.

మా ఫణి తడుముకోకుండా "ఏమీ అనకూడదు అక్కా. వాళ్ళకి కోపం వస్తుంది" అన్నాడు. అంతే కాకుండా "కోపం వస్తే వాయిస్తారు.. తబలిస్టులైతే ఓ పక్కే వాయిస్తారు. మృదంగం కదా రెండు పక్కలా వాయిస్తారు" అన్నాడు.

నేను బాగా నవ్వాను. ఇలా నేను ఎవరితో మాట్లాడినా, ఎవరు నాతో మాట్లాడినా ఫోన్ పట్టుకుని చాలా సేపు నవ్వుతూ ఉంటాం.

మా వి.ఎన్.ఆదిత్య (మనసంతా నువ్వే, నేనున్నాను లాంటి సినిమాల డైరెక్టర్) కూడా నాకు తమ్ముడే వాళ్ళ అన్నయ్య మొన్న ఓ సెటైర్ వేసాడుట. "ఏరా... రమణిగారూ నువ్వూ మాట్లాడుకున్నంతసేపూ జోక్స్ వేసుకుంటారు. ఇవి సినిమాల్లో ఏవైనా పెడ్తారా? లేదా ఎయిర్‌టెల్ పాలేనా?" అని.

ఆ మాటకి మేమిద్దరం ఆలోచించాం. నిజంగా మేం వేసుకునే జోక్స్‌లో సగం గుర్తుపెట్టుకుని సినిమాల్లో పెట్టినా త్రివిక్రమాన్ని మించి విక్రమాన్ని ప్రదర్శించేవాళ్ళం. కానీ ప్చ్.. మాకంత లేదు.

ఆ మధ్య మా అబ్బాయి మాస్టర్స్ చెయ్యడానికి అమెరికాకి వెళ్ళాల్సిన సందర్భంలో ఆదిత్య ఫ్రెండ్ మూర్తి మావయ్యకి ఫోన్ చేసి ర్యాలీలో దిగగానే రిసీవ్ చేసుకోమని చెప్పాం. ఆ విషయం మామూలుగా చెపితే సరిపోయేది. కానీ నేను ఆదిత్యతో "మూర్తి మావయ్యకి (బాగా చిన్నపిల్లాడే కానీ ఆదిత్యకి మావయ్య వరస, అందరం అలాగే పిలుస్తాం) వీడ్ని తన స్వంత తమ్ముడిలా చూసుకోమని చెప్పు" అన్నాను.

ఆదిత్య తడుముకోకుండా "ఒద్దండీ రమణిగారి అబ్బాయిగా చూసుకోడమే కరెక్ట్!" అన్నాడు.

"అదేవిటీ?" అని ఆశ్చర్యపోయాను.

"వాడంతే మీ అబ్బాయంటే మర్యాదగా చూస్తాడు. అదే తమ్ముడైతే "ఏరా.. ఏవిట్రా ఏబ్రాసి మొహం? సూట్‌కేస్ పట్టుకో.. పద. కారెక్కి ఏడు అన్నా అనచ్చు" అన్నాడు.

నాకు మల్లాది గారు రాసిన నవలలో సన్నివేశం గుర్తొచ్చింది. "ఫ్యామిలీ హోటల్" అని వెళితే పడక కుర్చీలో కూర్చున్న ముసలాయన "ఏరా.. పొద్దుటినుంచీ ఎక్కడ చచ్చావ్? లోపలికి పోయి అన్నం తిని ఏడు" టైప్‌లో మాట్లాడ్తాడు.

అమ్మలా అన్నం పెడుతూ ముసలావిడ "తమ్ముడికి పరీక్ష ఫీజు కట్టావా? నాన్నగారికి దగ్గు మందు తెచ్చావా? ఈ పూట పచ్చడీ, చారూ తప్ప ఏం చెయ్యలేదు. కాస్త సర్దుకో" అంటుంది. అంటే స్వంత కుటుంబం అన్న ఫీలింగ్ కలగ చెయ్యడానికి అన్నమాట. అలాగే మూర్తి మా అబ్బాయిని స్వంత తమ్ముడిలా ఎక్కడ చూసేసుకుంటాడో అని ఆదిత్య కంగారు పడిపోయాడు.

సాధారణంగా నాకు దొరికే స్నేహితులే హాస్య ప్రియులుగా ఉంటారో, లేక నేనే ఎవరిలో నైనా హాస్యాన్ని వెదుక్కుంటానో కానీ, ఎక్కడికెళ్ళినా కళ్ళ నీళ్ళు తిరిగేలా నవ్వుతూనే ఉంటాం.

నిన్న ప్రొద్దుట మా ఇంటికి టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ నుండి మనుషులొచ్చి "టెలిఫోన్ రిపెయిర్ చెయ్యాలని కంప్లైంట్ ఇచ్చారుగా, వచ్చాం" అన్నారు,.

నేనూ మా అబ్బాయి మొహాలు చూసుకుని "లేదే మా ఫోన్ నిక్షేపంలా వర్క్ చేస్తోంది" అన్నాం.

"లేదండీ . కంప్లైంట్ వచ్చింది " అన్నాడు అతను.

"ఎవరిచ్చారో అడుగుతాం. ఓ వేళ ఎడ్రస్ తప్పేమో" అన్నాను.

డోర్ నెంబర్‌తో సహా అన్నీ కరెక్టే, చెక్ చేసి చెప్పాడు.

సాయంత్రం మా పెద్దబ్బాయినీ, మా ఆయన్ని కూడా అడిగాను. వాళ్ళూ ఇవ్వలేదన్నారు. ఓ మూడు రోజులయ్యాక మా ఫ్రెండ్ సుశీల మజ్జిగ పులుసు ఇవ్వడానికి వచ్చింది (చాలా బాగా చేస్తుంది అంటానని, చేసినప్పుడల్లా ఇస్తుంది). నేను సుశీలతో మాట్లాడుతుండగా టెలిఫోన్ టాపిక్ వచ్చింది. "అవును రమణీ ఎన్నిసార్లు ల్యాండ్‌లైన్‌కి చేసినా నువ్వు తియ్యడం లేదు. పాడయిందేమోనని నేనే కంప్లైంట్ ఇచ్చాను" అంది. నాకు లాండ్ లైన్‌కి ఫోన్ చేసే ఫ్రెండ్స్ ఉన్నారని మా పిల్లలు వెక్కిరిస్తారు. "మీ ఫ్రెండ్స్‌కి చెప్పమ్మా సెల్‌కి చెయ్యమని. ఆ లాండ్ లైన్ మోగితే అందరం పొద్దుటే నిద్రలేస్తున్నాం" అంటాడు పెద్దవాడు.

(వాడి పొద్దుట అంటే పది లెండి). ఇలా లాండ్ లైన్‌కి చేసి, మేం తియ్యకపోతే బాధపడే వాళ్ళల్లో మా మావయ్య, బాబాయ్ కూడా ఉన్నారు. నిజం చెప్పొద్దూ నేను ఇంట్లో ఉన్నా బెడ్ రూంలోంచి హాల్లోకి నడవడానికి బద్ధకించి తియ్యను. మూడు సార్లు చేసి, వాళ్ళే నా సెల్‌కి చేస్తారని ధీమా. నా పిల్లలకీ నా పోలికే. మా వారు మాత్రం మా ఇంట్లోకెల్లా ప్లాన్డ్‌గా ఉంటారు. ఉదయం నాలుగు గంటలకల్లా నిద్రలేచి, వాకింగ్‌కి వెళ్ళొచ్చి, రాత్రికూడా ఎనిమిదికల్లా భోంచేసి, తొమ్మిదిన్నరకల్లా నిద్రపోతారు. మా బద్ధకం చూస్తే ఆయనకి ఒళ్ళుమంట. పొద్దుటే నాలుగింటికి నిద్రలేస్తే జీవితంలో పైకి వస్తారని మా ఆయన రోజూ చెప్తుంటారు. మా చిన్నాడు వెంటనే అంటాడు "అవును నాలుగ్గంటలకల్లా అందుకే పనిమనిషి చీపురుతో పైకి వస్తోందని"

మా పెద్దాడు ఉద్యోగం మారాడు. ఇప్పుడు ఎనిమిదిన్నర కల్లా బయలుదేరాలి. ఆయన నెలముందు నుండే "పొద్దున్నే లేవడం ప్రాక్టీస్ చెయ్యి" అని చెపుతున్నారు. వాడికి ఒళ్ళు మండింది. "రేపు ఓ వేళ నాకు పెళ్ళి కుదిరి ఏ తెల్లవారు ఝాము మూడింటి ముహూర్తమో అయితే కూడా ఇలాగే ప్రతి రోజూ నెలనుండీ రిహార్సల్సా నాకు?" అని అడిగాడు.

మానవుడికి మంచి చెపితే ఇలాగే ఒళ్ళు మండుతుంది కదా!

నిత్య జీవితంలో మన చుట్టూ చాలా వినోదం ఉంటుంది. ఎటొచ్చీ మనమే పట్టించుకోం. మా ఫ్రెండ్‌కి, నాకూ ఇంటర్మీడియెట్ అవగానే, ఇంచుమించుగా ఒకేసారి పెళ్ళిళ్ళు అయ్యాయి. దాని పేరు సత్యప్రియ. అది ఇంట్లో ఉన్న వస్తువులకి భలే పేర్లు పెట్టేది. "జయమాలిని బాండీ... ఇది కుదురుగా ఉండదు" అనేది. అలాగే పట్టకారుని "దీనిది ముసలి విలన్ ప్రభాకరరెడ్డి పట్టు, గిన్నె జారిపోతుంది" అనేది. ముసలి విలన్స్ రేప్ సీన్లో హీరోయిన్‌ని అలాగే పట్టుకుంటారుట. వాళ్ళు జారిపోయి పరిగెత్తి, రెండు సార్లు పడి,

హీరో వచ్చేదాకా ఎంగేజ్ చేస్తారుగా! అలాగే అంట్లు తోమే పీచులని అత్తగారితో, ట్యూబ్‌లైట్‌ని ఆడబిడ్డతో, లైటర్‌ని తోడికోడలతో రకరకాలుగా పోల్చేది. ఒక్కోసారి అది వంట గదిలో గిన్నెలతో "సరిగ్గా ఉండు. నిన్ను అందుకే పక్కింటి పనిమనిషి వెంకమ్మ కేసి తోమించేది, బుద్ధిగా ఉండవు" అని మాట్లాడుతుండేది.

మేం ఇద్దరం కలిసినప్పుడు హ్యూమర్ ఇంకా ఎక్కువయిపోయి, కుంటి స్టూల్‌ని "కాంతారావు మాస్టారు" అనీ, మసిగుడ్డని "డేవిడ్ సార్" అనీ, పిడకలు కనిపిస్తే "కస్తూరీ మేడమ్" అనీ (ఆవిడ సిగ అలా ఉండేది) మా లెక్చెరర్స్‌తో పోల్చి నవ్వుకునే వాళ్ళం. మా అన్నయ్య ఫ్రెండ్స్ అయితే మరీ ఘోరం, మా కుక్కకి వాళ్ళ ప్రిన్సిపాల్ పాండురంగం పేరు పెట్టి "పాండుగాడు చూడు మనం తింటుంటే ఎలా చూస్తున్నాడో నాలిక బయట పెట్టి" అని మాట్లాడుకునేవాళ్ళు. ఆ వయసులో అవన్నీ తప్పనిపించేవి కావు.

ఇంక కొంతమందికి అమాయకత్వంలోంచి హాస్యం పుట్టుకొస్తుంటుంది. మా అక్క ఆడబిడ్డ ఓసారి వాళ్ళాయన, కొలీగ్స్‌తో ఇంట్లో కూర్చుని మాట్లాడుకుంటూ ఉండగా, వెళ్ళి "ఏవండీ పక్కింటి కొండలరావుగారి అండర్‌వేర్ కానీ మీరు వేసుకొచ్చారా? ఛీ.. ఛండాలం.. వాళ్ళావిడ వాళ్ళ తాడు మీద జాగా లేక మన దండెం మీద ఆరేసిందట పాపం. చూడండీ" అంది.

ఆయన ఆ ఎంబరాసింగ్‌కి ఏడవలేక నవ్వు మొహం పెట్టి "హాహాహా.. నాదే వేసుకున్నాలేవే. వెళ్ళు లోపలికి" అన్నాడు.

"లేదండీ. మీవన్నీ నేను మడతపెట్టి బీరువాలో పెట్టా, ఓసారి లేచి చూడండీ" అని అక్కడే నిలబడింది ఆ అమాయకురాలు.

ఇంకోసారి మా పిన్ని చెల్లెలు రిక్షాలో వచ్చింది. దిగుతూనే ఆనందంగా "అక్కా.. ఏం తెచ్చానో చూడు. శనివారంగా సాయింత్రానికి కొబ్బరి పచ్చడి చెయ్యి ఇడ్లీల్లోకి" అంది. తన చేతుల్లో మిలమిలా మెరిసిపోతున్న రెండు కొబ్బరి చిప్పలుట.

"ఎక్కడివే?" అని మా పిన్ని అడిగితే "ఎవరో పారేసుకున్నట్లున్నారు. బంగారం షాప్ దగ్గర దొరికాయి" అందిట. పెద్దపిల్లే అనుకోండీ.. కానీ దిష్టి తీసి పారేస్తారని తెలీదు పాపం. రెండు కొబ్బరి చిప్పలు సంపాదించానని బోలెడు ఆనంద పడింది.

మొన్న సెట్లో మా అసిస్టెంట్ డైరెక్టర్ ఒకతన్ని "ఆ అమ్మాయి మన సినిమాలో సిస్టర్ కారెక్టర్ చేస్తుందేమో కనుక్కురా" అని రామానాయుడు స్టూడియో చూడ్డానికి వచ్చిన ఓ అమ్మాయి దగ్గరకి డైరెక్టర్ పంపించాడు.

అతను వెళ్ళి వచ్చి "నో రిప్లై" అన్నాడు. "నోరిప్పలేదా?" అన్నాను నేను ఆశ్చర్యంగా. అతను "No reply అన్నాను మేడం" అన్నాడు.

ఆహా! కొన్ని ఇంగ్లీషు ప్రయోగాలకీ తెలుగు మాటలకీ ఎంత పోలికా అనుకున్నాను. నిన్న సరిగ్గా అలాగే సీరియల్ సిట్టింగ్‌లో "ఆ అమ్మాయి మధుర స్మృతులతో ఆ రాత్రి మంచం మీద ఉంటుంది" అని డైలాగ్ రైటర్ చెపుతుంటే నేను "ప్రొద్దుట అమ్మ గురించి టాపిక్ వచ్చింది కాబట్టి మదర్ స్మృతులతో ఉంటే కరక్టేమో" అన్నాను.

మధుర స్మృతులకీ, మదర్ స్మృతులకీ అంత దగ్గర సంబంధం ఉంది. మదర్ అనగానే మా అమ్మ గుర్తొచ్చింది. మా అమ్మ నేను ఆవిడతో ఏ షాపింగ్‌కో వెళ్ళినప్పుడు, ఆవిడని ఒక్కతినే వదిలి ఏ పక్క షాప్‌కో వెళ్ళొచ్చేసరికి ఎవరితోటో బోలెడు కబుర్లు చెపుతూ కనిపిస్తుంది. నన్ను చూడగానే "అదిగో మా పాప వచ్చింది" అంటుంది. వాళ్ళు అంత సేపూ విన్న పాప ముచ్చటలన్నీ నా గురించే అని తెలిసి నోరు తెరిచి ఉండిపోతారు. నేను "పాప" అని నా గురించి చెప్పొద్దు అని ఎన్నిసార్లు చెప్పాలి? అని పళ్ళు పిండుకుంటాను.

ఇంకా కొన్నిసార్లు వాళ్ళు నేను రాగానే "రండి రమణీగారూ! మీ పెద్దబ్బాయికి ఎలాంటి అమ్మాయి కావాలి? ఆ అమెరికా సంబంధం ఏవయిందీ?.. మొన్న మీరు బాత్రూములో జారి పడ్డారుట కాలు ఎలావుంది? మీ ఆయన కొన్న ఎలక్ట్రిక్ కొబ్బరి తురుం పీట ఎలా ఉందీ?" లాంటి ప్రశ్నలు వేస్తారు. నేను లోపలికి వెళ్ళొచ్చిన ఐదు నిమిషాల్లో నా ఆటో బయోగ్రఫీ సగం చెప్పేసిన మా అమ్మ వైపు ఆశ్చర్యంగా చూస్తాను నేను.

ఇలాగే నేనూ గొల్లపూడి మారుతీరావుగారూ, వాళ్ళావిడా కలిసి అమెరికాలో ప్రయాణం చేస్తున్నప్పుడు, నేనూ ఆయనా మెట్లు దిగుతూ, మా కన్నా ముందే వీల్ ఛెయిర్ దిగి అక్కడ ఓ నల్ల అబ్బాయితో కబుర్లు చెపుతున్న వాళ్ళావిడ్ని చూసాం.

"అతనికి ఇంగ్లీషు కూడా వచ్చినట్లు లేదు చూస్తే. ఆంటీ ఏం మాట్లాడ్తోందో" అన్నాను.

దానికి మారుతీరావుగారు నవ్వుతూ "బోలెడు భోగట్టా రాబట్టేసి ఉంటుంది ఈ పాటికి మా శివానీ.. పాపం వీడికి రెండోసారి కూడా డైవోర్స్ అయిందటండీ ఈ మధ్యన. పిచ్చి సన్నాసి. తల్లి మూడో పెళ్ళికి వెళ్తున్నాడట. ఉద్యోగం పోయి గ్యాప్‌లో ఉన్నాడట. వీడిది మనం వెళ్ళే హ్యూస్టన్ పక్క స్టేటేట. బీట్రూట్ కూర ఇష్టమట. కొబ్బరి వేసి ఎలా చేసుకోవాలని చెప్తున్నాను అన్నా ఆశ్చర్యపోవద్దు" అన్నారు.

మరీ అలాకాదు కానీ ఆంటీ అతని గురించి మాకు తర్వాత చాలా విషయాలు చెప్పారు. మనం సంఘజీవులం కదా. పక్కవాడిది ఏ భాష అయినా మనకి అనవసరం బోలెడు కబుర్లు చెపుతాం. వాడికి అర్థం అవకపోతే అదృష్టవంతుడు. అయితే ఆనందపడ్తాడు.

మొన్న మా మేనల్లుడు ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర రాంగ్ రూటులో వస్తుంటే ట్రాఫిక్ పోలీస్ వచ్చి ఫోటో తీసాడుట. వెంటనే మా మేనల్లుడి భార్య కిటికీ అద్దం దింపి 'రిషీ అంకుల్ ఫోటో తీస్తున్నాడు స్మైల్ చెయ్యి' అందిట. వస్తూ వస్తూ కారు కదిలిపోయాక ఎఫ్ఫ్.బిలో కూడా షేర్ చెయ్యి బాబూ అని అరిచిందట. "పోలీస్ అంకుల్ ఫోటో తీస్తే మర్నాడు ఫైన్ కట్టమని రసీదు వస్తుందని తనకి తెలియదట పాపం." అని మా మేనల్లుడు చెప్పాడు. ఇందులో నిజమెంతో తరవాతి విషయం. అలాగే రైల్వే స్టేషన్ నుంచి ఆటోలో వస్తుంటే మా మేనల్లుడుకి డ్రైవర్ ముందు రవి అని పేరు రాసి కనపడిందట.

డ్రైవర్ ని 'నీ పేరు రవినా అని అడిగాడట'.

'అవును అన్నాడట అతను.'

'నా పేరు కూడా రవే అన్నాడట'


'అయితే మీరు కూడా లంబాడీసేనా, నీకూ ఆటో ఉందా? ' అని అమాయకంగా అడిగాడుట.

వీడు ఆర్మీలో మేజరు లెండి. ఇంకా పెద్ద పెద్దవి నడిపిస్తాను అని చెప్పాడుట నవ్వుతూ.

మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి భార్య పద్మజ నిన్న ఓ రచయిత్రి గురించి చెప్పింది. ఆవిడ మా చిన్నప్పుడు చాలా నవలలు రాసినావిడలెండి. 'హీరో హీరోయిన్ దగ్గరకి వచ్చిన తర్వాత వాళ్ళిద్దరూ కాసేపు ఏదో మాట్లాడుకున్నార' అని రాసేదట ఆ రచయిత్రి. 'ఏదో మాట్లాడుకున్నారని రాస్తే ఎలాగండీ? ఆ ఏదో ఆవిడకన్నా తెలియాలి కదా' అన్నది పద్మజ బాధ. నిజమే కదా! నేను ఏదేదో రాస్తూంటాను. ఆ ఏదో నాకైనా తెలియాలి కదా!

నిన్నరాత్రి కామెడీ విత్ కపిల్‌షోలో (కలర్స్ ఛానెల్‌లో వస్తుంది ఇది) ఓ జోక్ చెప్పాడు. "మా తాత చాలా ధైర్యస్తుడు. సింహం ఎదురైతే ధైర్యంగా ఎదురెళ్ళాడు" అని. 'ఆ తర్వాతా? ' అని అడిగాడు పక్కవాడు. "ఏమౌతుందీ? నోట్లోంచి వెళ్ళాడు. దాని వెనకనుండి వచ్చేసాడు" అన్నాడు. (తిట్టుకోకండి హాస్యం కొన్నిసార్లు ఎల్లలు దాటుతుంది!)

Post your comments


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
రఘుపతి వెంకయ్య పురస్కా
బలభద్రపాత్రుని రమణి కాలమ్ దాటని కబుర్లు
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి